క్లుప్తంగా

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**ఉయ్యాలవాడ:** మండలంలోని సుద్దమల్ల గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 6 లక్షలు మంజూరు చేయడంతో ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. వేకువజామున వేద పండితుల ఆధ్వర్యంలో నవగ్రహాల ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా చెన్నకేశవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠగావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో అర్చకులు కమలేష్‌శర్మ, గ్రామస్తులు కూడాల నారాయణరెడ్డి, బాబులురెడ్డి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



కొండుపల్లెలో పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

**ఉయ్యాలవాడ:** మండలంలోని కొండుపల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో భాగంగా సరిహద్దు కందకాల పనులను నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తయ్యాయని కూలీలు వలస వెళ్లకుండా సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎండాకాలం ప్రారంభమైందని, పనులకు ఉదయం 6గంటల లోపే కూలీలు పాల్గొనేలా చూడాలన్నారు. వారికి తాగునీరు, టార్పాలిన్ పట్టాలతో నీడ, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి కుటుంబం వంద రోజులు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు షరీఫ్ బాషా, కాలేషా, ఓబుళరెడ్డి, ఏపీఓ రవిప్రకాష్‌కు సూచించారు.

## ముగిసిన బండలాగుడు పోటీలు

**గోస్పాడు:** ఉగాది పండుగ పురస్కరించుకొని దీబగుంట్లలో ఏర్పాటు చేసిన ఎద్దుల బండలాగుడు పోటీలు సోమవారం ముగిశాయి. ఆరుపండ్ల విభాగం పోటీలను మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ పీపీ నాగిరెడ్డి ప్రారంభించగా నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేలు బహుమతి సాధించాయి. శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన సుభహాన్ ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ.30వేలు, పెద్దకందుకూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.20వేలు, లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన అణన్య రెడ్డి ఎద్దులు నాల్గవ స్థానంలో నిలిచి రూ.10వేలు బహుమతులు పొందాయి.

## ఆటో బోల్తా..యువకుడికి తీవ్ర గాయాలు

**రుద్రవరం:** కొండమాయపల్లె గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి రేహన్ అనే యువకుడు తీవ్రగాయాల పాలయ్యాడు. శిరివెళ్లకు చెందిన రేహన్ వ్యాపారంలో భాగంగా సోమవారం ఉదయం ఆటోతో రుద్రవరం సంత మార్కెట్‌కి వచ్చి సరుకులు విక్రయించి రాత్రి ఆటోలో ఇంటికి తిరుగు పయనమయ్యాడు. కొండమాయపల్లె సమీపంలోకి చేరుకోగానే వేగంగా వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు 108కు సమాచారం అందించగా.. వారు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ వైద్యశాలకు తరలించారు.

## ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

**దొర్నిపాడు:** ఓటర్ జాబితాకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని తహసీల్దార్ జయప్రసాద్ బీఎల్‌ఓలను ఆదేశించారు. మండలంలో 19,751 ఓటర్లు ఉండగా 16,590 మంది ఓటర్లకు ఆధార్‌ను అనుసంధానం చేయడంతో 84.01 శాతం పూర్తయిందన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు నీటి తీరువాను ఆయా సచివాలయాల్లో చెల్లించి రసీదు పొందాలన్నారు. ఏ రైతు ఎంత చెల్లించాలన్నది వారి సర్వే నంబర్, విస్తీర్ణంను బట్టి ఉంటుందన్నారు. సర్వేయర్ మల్లయ్య, వీఆర్‌ఓ సాంబశివుడు పాల్గొన్నారు.

## ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి

**ఆళ్లగడ్డ:** చాగలమర్రి ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న షంషాద్‌బాను గ్రూప్–1 పోస్ట్‌కు ఎంపికై వెళ్లారు. అప్పటి నుంచి ఏఓ చంద్రశేఖర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్నారు. ఈ క్రమంలో రుద్రవరం ఈఓపీఆర్డీగా వ్యవహరిస్తున్న భాగ్యలక్ష్మికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

# పల్లె పిడుగులు.. క్రీడల్లో మెరికలు

● జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్న భాగ్యనగరం విద్యార్థులు

పల్లె విద్యార్థుల్లో ఆణిముత్యాలు దాగి ఉంటారని వారంతా నిరూపించారు. తమకు తర్ఫీదునిస్తే ఎలాంటి పతకమైనా వశమవ్వాల్సిందేనని ఆడి చూపుతున్నారు. దొర్నిపాడు మండలంలోని భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్, త్రోబాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణిస్తుండటం విశేషం.

**దొర్నిపాడు:** భాగ్యనగరం. అదో మారుమూల పల్లె.. నేడు ఆ పాఠశాల పేరు జాతీయస్థాయిలో మారుమోగుతోంది. కారణం..అక్కడి క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో మెరిసి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్, త్రోబాల్ పోటీల్లో పాల్గొంటున్నారు. అత్యుత్తమ విజయాలు సాధిస్తూ ఇటు పాఠశాలకు, గ్రామానికి ఖ్యాతి తెచ్చిపెడుతున్నారు. చదువులోనే కాదు.. ఆటల్లో కూడా రాణిస్తున్నారు. బడి అంటే పుస్తకమొక్కటే కాదు..మైదానం కూడా అని చాటిచెబుతున్నారు.

**విద్యార్థుల ప్రతిభ..పీడీ శ్రీధర్ పట్టుదల..**

పల్లెటూరి పిల్లలకు శిక్షణ ఇస్తే మెరికల్లా మారతారని పీడీ శ్రీధర్ నిరూపించారు. విద్యార్థుల కృషి, పీడీ పట్టుదలతో గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో ఆడటం గర్వించదగ్గ విషయం. తమకు ఇష్టమైన క్రీడలో నైపుణ్యత ప్రదర్శించి సత్తాచాటుతున్నారు. వారిని ఆయా క్రీడల్లో మరింత రాటుదేలేలా శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా జాతీయ స్థాయి పోటీల్లో రాణించాల్సిన అంశాలు, ఎలా ఆడాలి, నైపుణ్యం తదితర వాటిని విశ్లేషిస్తూ వారిలో ఉత్సాహం రేకెత్తించడమే కాకుండా విజయం సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.



క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు




66వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఉమ్మడి జిల్లా జట్టులో భాగ్యనగరం విద్యార్థుల సంబరాలు

**జాతీయస్థాయిలో రాణించాలంటే శ్రమించాలి**



గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను చూపుతూ జాతీయ స్థాయిలో ఆడటం సాధారణమైన విషయం కాదు. ఇందుకు ఎంతో శ్రమించాలి, అలాగే నిపుణుడైన కోచ్ కూడా అవసరం. తమ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో ఆడటంలో పీడీ శ్రీధర్ కృషిఎంతో ఉంది. విద్యార్థులు, పీడీకి అభినందనలు. –మురళీధర్, హెచ్‌ఎం, భాగ్యనగరం

### చరిష్మా చూపిన చందన..



భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.చందన గతేడాది డిసెంబర్ 2న హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ నంద్యాల డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అదే నెల 5, 6, 7 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కీలకంగా మారడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ ఏడాది జనవరిలో బిహార్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్‌జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని పతకం సాధించి ప్రశంసలు పొందింది.

### త్రోబాల్ జిల్లా కెప్టెన్‌గా శ్రీహరి..



భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీహరి.. నంద్యాలలో నిర్వహించిన అండర్–14 త్రోబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2023 జనవరి 28– 30 వరకు నంద్యాలలో నిర్వహించిన అండర్–14 విభాగంలో 66వ ఎస్‌జీఎఫ్ త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉమ్మడి కర్నూలు జిల్లా కెప్టెన్‌గా వ్యవహరించి జిల్లా టీం విజయంలో కీలకపాత్ర పోషించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

### సత్తా చాటిన చందన..



పదో వతరగతి చదువుతున్న జి.చందన 2022 నవంబర్‌లో నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 త్రోబాల్ పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ంది. డిసెంబర్ 17, 19 తేదీల్లో వైఎస్సార్ జిల్లా కమలాపురంలో నిర్వహించిన అండర్–17, 66వ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు రెండవ స్థానంలో నిలవడంలో కీలకంగా వ్యవహరించింది. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. చందన చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తుండటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సులోచన..సూపర్



పదో తరగతి చదువుతున్న ఎస్.సులోచన 2022 డిసెంబర్ 5న నద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో సత్తా చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ ఏడాది జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు ప్రకాశం జిల్లా దొనకొండలో నిర్వహించిన 66వ రాష్ట్రస్థాయి అండర్–17 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఒక పక్క పది పరీక్షలకు సిద్ధమవుతూనే హ్యాండ్ బాల్ క్రీడలో రోజూ సాధన చేస్తూ ప్రతిభను మెరుగుపరుచుకుంటోంది.

## వైద్యుడి కోసం నిరీక్షించాల్సిందే..



ఎముకల విభాగం వద్ద డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న రోగులు

**బొమ్మలసత్రం:** నంద్యాల సర్వజన ఆసుపత్రిలో కొందరు వైద్యుల తీరు రోగులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఆసుపత్రిలోని ఓపీ విభాగంలో పురుషుల కీళ్లు, ఎముకల గదికి డాక్టర్ 9 గంటలకు రావాల్సి ఉంది. అయితే 10:30 గంటలు దాటినా డాక్టర్ రాకపోవటంతో అక్కడికి వచ్చిన రోగులు అసహనానికి లోనయ్యారు. కీళ్లు, ఎముకల విభాగానికి అధికంగా వృద్ధులు వస్తుంటారు. వారు ఆసుపత్రికి రావటానికే నానా అవస్థలు పడుతుంటారు..ఇక్కడి వచ్చిన తరువాత వైద్యుడి కోసం గంటల పాటు నిరీక్షించాల్సి వస్తుండటంతో నిలవకపోతున్నారు. దీంతో వైద్యుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడమే ఇందుకు కారణమంటూ మండిపడుతున్నారు. దీనిపై సూపరింటెండెంట్ ప్రసాదరావును వివరణ కోరగా.. తాను స్పందన కార్యక్రమంలో ఉన్నానని ఆసుపత్రిలో ఆర్‌ఎంఓ ఉంటారని సమాధానమిచ్చారు.

## ఆర్‌బీకే ఛానల్‌లో వ్యవసాయ సలహాలు

**దొర్నిపాడు:** రైతుల కోసం ప్రభుత్వం ఆర్‌బీకే ఛానల్‌ను ప్రారంభించిందని, ప్రతి రైతూ సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. సోమవారం పలువురు రైతులకు ఆర్‌బీకే ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఛానల్‌లో పంటల సాగుపై ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు సూచనలు వస్తాయన్నారు. వరి, పత్తి, మిరప, మినుము, మొక్కజొన్న, బంతిపూల సాగు తదితర వాటిపై సందేహాలకు సమాధానలు సైతం ఇస్తారన్నారు. దీంతో రైతులకు అరచేతిలో ఆర్‌బీకే సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వ్యవసాయ శాఖ తీసుకొచ్చిన ఈ ఛానల్ రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం

**బొమ్మలసత్రం:** పేదలకు మెరుగైన వైద్యం అందేందుకు వైద్యరంగంలో పెను మార్పులను ప్రభుత్వం తీసుకొస్తుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నూనెపల్లి సమీపంలో ప్రభుత్వం నిర్మిస్తున్న వైద్యకళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఇప్పటికే సర్వజన ఆసుపత్రిలో రూ. కోట్లు వెచ్చించి పలు భవనాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల వివరాలు మ్యాప్ ద్వారా తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా రవి

## నాణ్యమైన ఇంధనం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

**నంద్యాల(రూరల్):** వినియోగదారులకు నాణ్యమైన ఇంధనం అందించాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా సూచించారు. సోమవారం మండలంలోని భీమవరం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పోలూరు సొసైటీ) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా మరిన్ని పెట్రోల్ బంకులు, రైతులకు అవసరమయ్యే గోదాములు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం సొసైటీ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేయడంతో పాటు వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తుండటం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార కేంద్ర బ్యాంకులు రైతులకే కాకుండా పొదుపు సంఘాలకు, చిరు వ్యాపారులకు, నూతన పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకొనే వారికి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తుండటం సంతోషకరమన్నారు. అనంతరం పోలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ మహాలక్ష్మి, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, డీసీఓ విజయకుమారి, డీసీసీబీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ కర్నూలు పట్టణ అధ్యక్షుడు రాజా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ రఘురామిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**గోస్పాడు:** సొసైటీల పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. యాళ్లూరు గ్రామ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్వహించిన కమ్యూనిటీ హాల్, టెంట్ హౌస్‌ను సోమవారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ బెక్కెం రామసుబ్బారెడ్డి , రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడి పాల్గొన్నారు.

# ముగిసిన ‘బార్’ నామినేషన్ల ప్రక్రియ

**నంద్యాల(వ్యవసాయం):** బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉత్కంఠ భరితంగా కొనసాగింది. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వివిధ విభాగాలకు న్యాయవాదులు నామినేషన్లు వేశారు. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు విజయశేఖర్‌రెడ్డి, గోళ్ల జయకృష్ణ నామినేషన్ వేశారు. ఉపాధ్యక్ష పదవికి త్రిముఖ పోటీ నెలకొంది. ఎంఆర్ కృష్ణారెడ్డి, బొల్లెద్దుల రవికుమార్, అరిగెల రఘుప్రకాష్ పోటీ పడ్డారు. జనరల్ సెక్రటరీగా ప్రతాపరెడ్డి, శ్రీనివాసులు నామినేషన్లు వేశారు. జాయింట్ సెక్రటరీగా మద్దిలేటి యాదవ్, మహిళా ప్రతినిధిగా రాజేశ్వరి, లైబ్రేరియన్‌గా బాబురావు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. మంగళవారం నామినేషన్లకు ఉపసంహరణ గడువు కాగా, ఎన్నికలు ఈనెల 31న అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, రాజేశ్వరరెడ్డి, సుదాంశరెడ్డి, షేక్షన్ను తెలిపారు.

**సాధారణ ఎన్నికలను తలపిస్తున్న ఎన్నికలు..**

నంద్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయని పలువురు న్యాయవాదులు చర్చించుకుంటున్నారు. గతంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసి అందరి మన్ననలను అందుకున్న సీనియర్ న్యాయవాది విజయశేఖర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయడంతో ఒక్కసారిగా ఎన్నికలు వేడెక్కాయి. మరో సీనియర్ న్యాయవాది గోళ్ల జయకృష్ణకు పలువురు సీనియర్ న్యాయవాదుల మద్దతు ఉండటంతో ఎన్నికలు రసవత్తరంగా మారే అవకాశం ఉంది. తమను గెలిపించాలని జూనియర్ న్యాయవాదులకు హామీల వర్షం కురిపిస్తున్నారు.

## వేలాలకు సాల్వెన్సీ తప్పనిసరి

**నంద్యాల(సిటీ):** మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్, పశువులసంత, సైకిల్ స్టాండ్ పార్కింగ్ బహిరంగ వేలాలకు సాల్వెన్సీ ఫీజు సర్టిఫికెట్ తప్పనిసరి అని మున్సిపల్ రెవెన్యూ అధికారి వరప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి కూరగాయల మార్కెట్, పశువుల సంత, సైకిల్‌స్టాండ్ పార్కింగ్‌కు బహిరంగ వేలాలు నిర్వహించారు. అయితే పాటదారులు సాల్వెన్సీ సర్టిఫికెట్ పొందుపరచనందున వేలాలను ఈ నెల29వ తేదీకి వాయిదా వేశారు.

## నేడు ‘వైఎస్సార్ ఆసరా’ సమావేశం

**నంద్యాల(సిటీ):** వైఎస్సార్ ఆసరా 3వ విడత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్‌మాబున్నిసా పాల్గొంటారన్నారు.

# పోటాపోటీగా వేలం పాటలు

**శిరివెళ్ల:** మండలంలోని మహదేవపురం గ్రామ పంచాయతీ వారపు సంత మార్కెట్ బహిరంగ వేలం పోటాపోటీగా జరిగింది. సోమవారం సర్పంచ్ పెద్ది రమణయ్య అధ్యక్షతన నిర్వహించిన వేలం పాటల్లో పంచాయతీకి 1.90 లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాది రూ.5.12లక్షలు ఆదాయం రాగా నేడు షేక్ బాషా వారపు సంత రూ.7.02 లక్షలు హెచ్చుపాట పాడి దక్కించుకున్నాడు. ఈఓపీఆర్డీ సాల్మన్‌రాజు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నరహరి, పంచాయతీ కార్యదర్శి రమణభట్టు పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ:** ఇంతకు ముందెన్నడూ లేని విధంగా మున్సిపాలిటీ గేట్ల వసూళ్ల వేలాలు పోటాపోటీగా సాగాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ రమేష్‌బాబు అధ్యక్షతన సోమవారం వేలాలు నిర్వహించారు. ఇందులో కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున పాల్గొని పోటీ పడి పాట పాడటంతో మున్సిపల్ ఆదాయం పెరిగింది. మూడు రకాల గేట్ల వసూళ్లకు సంబంధించి వేలం నిర్వహించగా ఇందులో దినసరి, వారపు సంత మార్కెట్‌కు రూ.12.50 లక్షలు, వాహనాల మెట్ల రూ 30.01 లక్షలు, కబేళా, జంతు వధుశాల రూ 6.02 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు.

## ప్రజల అండతో మళ్లీ సీఎం జగనే

**శిరివెళ్ల:** ప్రజల అండదండలతో మళ్లీ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మహదేవపురంలో రూ.2 లక్షలతో పూర్తి చేసిన సిమెంట్ రోడ్డు, మురుగు కాల్వలు, బోయలకుంట్లలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. బోయలకుంట్లలో జరిగిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అభివృద్ధిలో పోటీ పడాలే గాని తాము చేస్తున్న అభివృద్ధి పనులకు ఆటంకాలు కల్పించవద్దని హితవు పలికారు. ఎంపీపీ నాయక్ వసీం, మండల నాయకుడు ఇందూరు ప్రతాప్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు సుబ్బసత్యనారాయణ శ్రేష్ఠి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నరహరి, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.



బోయలకుంట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

# ఇది కదా అభివృద్ధి అంటే..



బి.నాగిరెడ్డిపల్లెలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

**రుద్రవరం:** పల్లెలు అభివృద్ధి బాట పట్టాయి. కొత్త భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులకు తగిన వసతులు సమకూరాయి. గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం .. కార్యాలయాలు, సిబ్బంది ఏర్పాటు చేశారు. ఇంకేం కావాలి.. ఇదే కదా అభివృద్ధి అంటే అంటూ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.4.40 కోట్లతో పూర్తి చేసిన వివిధ భవనాలు, సీసీ రోడ్లను సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలకు పల్లెల్లో వికసిస్తున్న అభివృద్ధి కనపడలేదా ప్రశ్నించారు. గతంలో ఎప్పుడైనా ఒకే రోజు ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భం ఉందా అని నిలదీశారు. ఇంతకుముందు ప్రజలు ఏవైనా పనులు చేయించుకోవాలంటే మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. జగనన్న వచ్చాక ఆ సమస్యకు పరిష్కారం చూపారు.నాణ్యమైన వైద్యం కోసం వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించారు. ప్రస్తుతం వారంతా తమ విధులు సక్రమంగా నిర్వహించేందుకు అన్ని రకాల వసతులు, వేగవంతమైన ఇంటర్నెట్ కల్పించామని చెప్పారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లు వేయించడంతో పాటు విద్యుత్ సమస్యలు పరిష్కరించామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రారంభోత్సవాలకు వెళ్లిన వారికి స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, విజయా డెయిరీ డైరెక్టర్ విజయసింహారెడ్డి, ఆళ్లగడ్డ, రుద్రవరం ఎంపీపీలు గజ్జెల రాఘవేంద్రారెడ్డి, మబ్బు బాల స్వామి, జెడ్పీటీసీ మాధవి, నరసింహా రెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులు రామ్మోహన్‌రెడ్డి, గిడ్డయ్య, పీఆర్ డీఈ నరసింహులు, వెంకటరాముడు, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

**వివిధ గ్రామాల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు..**

- నల్లవాగుపల్లెలో రెండు సీసీ రోడ్లు



ఆలమూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

- చిత్రేనిపల్లెలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల భవనాలు, వైఎస్సార్ యంత్ర సేవ కింద మంజూరైన ట్రాక్టర్
- ఆలమూరులో గ్రామ సచివాలయం,ఆర్‌బీకే భవనాలు
- టీ.లింగందిన్నెలో పాఠశాల ప్రహరీ
- నక్కలదిన్నెలో గ్రామం నుంచి మెట్ట వరకు వేసిన బీటీ రోడ్డు
- బి.నాగిరెడ్డిపల్లెలో రెండు సీసీ రోడ్లు
- పేరూరులో గ్రామ సచివాలయ భవనం
- ఎర్రగుడిదిన్నెలో వెల్‌నెస్ సెంటర్ భవనం, రక్షిత మంచినీటి పథకం, పశువైద్యశాల
- ఎల్లావత్తులలో గ్రామ సచివాలయ భవనం
- శ్రీరంగాపురంలో గ్రామ సచివాలయ భవనం
- కోటకొండలో ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, నాలుగు సీసీ రోడ్లు
- కే.కొత్తూరులో సీసీ రోడ్డు

**సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ..**

ఎల్లావత్తుల గ్రామానికి చెందిన తుమ్మల శరవయ్య అనే బాధితుడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి సోమవారం అందజేశారు.

## పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

**నంద్యాల(వ్యవసాయం):** స్థానిక ఖాదరబాద్ నర్సింగ్‌రావు మున్సిపల్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి, లాస్ ఏంజిల్స్ రాయలసీమ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు మునగాల సురేంద్రనాథరెడ్డి పాఠశాలకు క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. రూ.80వేలు విలువ చేసే టేబుల్ టెన్నిస్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, తదితర క్రీడా సామగ్రిని అందజేశారు.

## వర్గీకరణ చేపట్టాలి

**నంద్యాల(అర్బన్):** ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ హెచ్చరించారు. జస్టిస్ ఉషామెహరా కమీషన్ నివేదిక ఆధారంగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఏపీలో షెడ్యూల్ కులాల వర్గీకరణ చేపట్టాలంటూ సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.